# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 050
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
ఫిబ్రవరి 02, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## జర్నలిస్ట్ జగదీశ్వర్‌కు నివాళి

8లో..





# విజయ సారధి.. టీఎస్ దివాకర

## వనంలో జయకేతనం

- మేడారం సక్సెస్‌లో మాస్టర్ మైండ్
- జాతర విజయవంతంలో కీలక పాత్ర
- అన్నీ తానైన వ్యవహరించిన కలెక్టర్
- కోటిన్నర మంది భక్తులకు దివ్యానుభూతి

వనదేవతలు కొలువైన చోట.. భక్తి పారవశ్యం పొంగిపొర్లిన వేళ.. ఆ జనసంద్రాన్ని సురక్షిత తీరానికి చేర్చిన కెరటం ఆయన! మేడారం జాతర అంటే కేవలం మొక్కులు మాత్రమే కాదు.. అది ఒక పాలన పరమైన సవాలు. ఆ టాస్క్ ను స్వీకరించి 'శభాష్' అనిపించుకున్నారు ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర. ఆదివాసీల ఆచారాలను గౌరవిస్తూనే, ఆధునిక వసతులతో మేడారాన్ని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దిన ఆయన కృషి ప్రశంసలు అందుకుంటోంది. అటు ప్రభుత్వ లక్ష్యాలను, ఇటు భక్తుల సౌకర్యాలను సమన్వయం చేస్తూ కలెక్టర్ టీఎస్.దివాకర ఒక 'నిశ్శబ్ద విప్లవం' సృష్టించారు. 100 రోజుల్లో వన దేవతల గద్దెల పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. జాతరలో సకల సౌకర్యాలనుంచి.. వనదేవతల ఆగమనం.. తల్లుల వనప్రవేశం.. భక్తుల వీడ్కోలు వరకు ప్రతి అడుగులోనూ దివాకర తనదైన ముద్రవేశారు. అడవిలో అద్భుతం సృష్టించి.. వనంలో జయకేతనం ఎగురవేశారు. ఈ మహా జాతరను చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతం చేశారు.

వివరాలు2లో..



8లో..

## విజయమే లక్ష్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్
- నర్సంపేట, వర్ధన్నపేట ఎన్నికల ప్రభారీల కీలక సమావేశం




8లో..

## ఓం.. బీం..ఫాం..

- కొందరికే 'సార్ల' ఆశీర్వాదం
- వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు
- 'దడ' పుట్టిస్తున్న రెబల్స్
- ఆసక్తిగా 'పుర' ఎన్నికలు

## తాగునీటిని పునరుద్ధరించండి

- బల్దియా ఎదుట ధర్నా
- కమిషనర్ కాళ్లు మొక్కేందుకు యత్నించిన దళిత మహిళ



8లో..

# విజయ సారధి.. టీఎస్ దివాకర

## వనంలో జయకేతనం

- మేడారం సక్సెస్ లో మాస్టర్ మైండ్
- అన్నీ తానైన వ్యవహరించిన కలెక్టర్
- జాతర విజయవంతంలో కీలక పాత్ర
- కోటిన్నర మంది భక్తులకు దివ్యానుభూతి



గడ్డం కేశవమూర్తి
Cell:9390101862

దక్షిణాది కుంభమేళ మేడారం మహా జాతరలో ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర ఒకే ఒక్కడుగా వెలుగొందారు. సంకల్ప బలం, ఆత్మవిశ్వాసంతో ఆయన పని చేయడంతో పాటు, ఈ జాతరను విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దనసరి అనసూయ@సీతక్క ప్రోత్సాహంతో.. జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, జాతర చైర్ పర్సన్ ఇరుప సుకన్యతో పాటు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుని కలెక్టర్ ముందుకెళ్లి మహా జాతర విజయవంతంలో కీ రోల్ పోషించారు.

### తనదైన ముద్ర..

జాతరకు ముందు మేడారంలో రూ.251 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు మొదలు.. తల్లుల గద్దెల ఆధునీకరణ వరకు ప్రతి అంశంలోనూ కలెక్టర్ టీఎస్.దివాకర్ చొరవ స్పష్టంగా కనిపించింది. జాతర ప్రారంభం కావడానికి మూడు నెలల ముందు నుంచే గద్దెల సుందరీకరణ పనులపై కలెక్టర్ దృష్టి సారించారు. ప్రతిపాదనల రూపకల్పన మొదలు డిజైన్, రాతి స్తంభాలను చెక్కడం, వాటిపై చిత్రాలను మలచడం, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల నిలవులను మార్చడంతో సహా అన్ని పనులను ఆయన ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు జాతర ప్రాంగణంలోనే ఉండి పనులు వేగవంతంగా పూర్తయ్యేట్టు ప్రత్యక్ష పర్యవేక్షణ చేశారు. కొన్ని దశాబ్దాలుగా ఉన్న గద్దెల స్వరూపాన్ని మార్చడం, విస్తరించడం అనే పని అంతా సులువైంది కాదు. అందులోనూ ఆదివాసీల పురాణ చరిత్రను, వారి వంశస్తుల నేపథ్యాన్ని శిలలపై నిక్షిప్తం చేయడం సవాలతో కూడిన ప్రక్రియ. ఆదివాసి పూజారుల విశ్వాసం, భక్తుల విశ్వాసాలను రెట్టింపు చేస్తూ.. ఈ బాధ్యతను కలెక్టర్ దివాకర సమర్థవంతంగా, ఏ చిన్న పొరపాటు లేకుండా పూర్తి చేశారు.

### నిరంతర పర్యవేక్షణ..

జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక మంత్రి సీతక్క ఆదేశాల మేరకు 100 రోజుల్లో అభివృద్ధి పనులను పూర్తిచేయాలనే లక్ష్యంతో గద్దెల ప్రాంగణంలోనే కలెక్టర్ మకాం వేశారు. దివాకర నిద్రాహారాలు మాని నిరంతర పర్యవేక్షణ చేశారు. 2026 జనవరి 28 జాతర ప్రారంభం నాటికే పునరుద్ధరణ పనులను పూర్తి చేయడంతో పాటు, మేడారానికి ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చారు. మంత్రి సీతక్కతో ఎప్పటికప్పుడు చర్చించడం, చివరి నిమిషంలో అవసరమైన చోట్ల మార్పులు, చేర్పులు చేయడం ఈ క్రమంలో అటు ప్రభుత్వ పెద్దలతో నిరంతరం టచ్ లో ఉండడం, ఇటు ఆదివాసి పూజారులను కలుపుకొని పోవడం ద్వారా తన పరిపాలన సమర్థతను కలెక్టర్ చాటుకున్నారు. మేడారం ఆదివాసి పూజారుల ఆమోదంతోనే ఆలయ పునరుద్ధరణ పనులను పూర్తి చేశారు.














### ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ..

మహా జాతరలో నిరంతరం విద్యుత్ సరఫరా చేయించారు. మేడారంలో ప్రధాన ప్రాంతాలైన జంపన్న వాగు, దేవతల గద్దెలు, హరిత హోటల్ వై జంక్షన్, ఆర్టీసీ బస్టాండ్, ముఖ్య ట్రాఫిక్ మార్గాలు, రద్దీ ప్రాంతాలు తదితర ప్రధాన ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. భారీ ఎత్తున క్యూ లైన్లు నిర్మించి భక్తులు క్రమ పద్ధతిలో దర్శనం చేసుకునేలా తగిన ఏర్పాట్లు చేయించారు. అలాగే జాతర ప్రాంగణంలో పరిశుభ్రతతో పాటు, తాగునీరు, సానిటేషన్, వైద్యం, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూశారు. జంపన్న వాగు వద్ద సువిశాలమైన స్నానగటా లు, జల్లు స్నానపు (బ్యాటరీ ఆఫ్ టాప్స్) ఏర్పాట్లు చేయించారు. మేడారం గద్దెల వద్ద, జంపన్న వాగు, ఇతర ప్రాంతాల్లో రెస్క్యూ బృందం సేవలందించే విధంగా ప్రత్యేక ప్రణాళిక అమలు చేశారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మ మహా జాతర గురించి సమస్త సమాచారం అందరికీ తెలిసేలా జాతర వెబ్ సైట్ ను ఆవిష్కరించారు.హెలికాప్టర్ ద్వారా భక్తులకు విహంగ వీక్షణం కల్పించారు. ముఖ్యంగా భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయించారు. ప్రధాన రోడ్లు, జంక్షన్ లను అభివృద్ధి చేసి దగదగల మహా నగరిగా మేడారాన్నీ తీర్చిదిద్దారు.

### ప్రభుత్వం, ప్రజల నుంచి ప్రశంసలు..

సమ్మక్క, సారలమ్మలు గద్దెలపై కొలువుదీరినప్పటి నుంచి.. వన ప్రవేశం చేసే వరకు కలెక్టర్ దివాకర నాయకత్వంలో ములుగు జిల్లా అధికార యంత్రాంగం చేసిన పటిష్ట ఏర్పాట్లను భక్తజనం కొనియాడుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఈ మహా జాతర పనుల అమలు, ముఖ్యంగా గద్దెల పునర్నిర్మాణం పట్ల సంతృప్తిని వ్యక్తం చేయడమే కాకుండా కలెక్టర్ ను మెచ్చుకోవడం ఆయన సమర్థతకు నిదర్శనం. అలాగే, రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జుయేల్ ఓరమ్, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, కడియం కావ్య, న్యాయమూర్తులు, వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, వివీఐపీ, వీఐపీలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా దర్శనం చేయించారు. తల్లుల సేవలో పునీతమైన ఆయన భక్తులందరికీ దర్శనాలు వేగంగా జరిపించారు. సమ్మక్క, సారలమ్మ గద్దలపై పసుపు, కుంకుమ, చీర సారెలు, నిలువెత్తు బంగారం సమర్పించే విధంగా పటిష్ట ఏర్పాట్లు చేసి భక్తజనకోటితో కలెక్టర్ శభాష్ అనిపించుకున్నారు.

### క్లీన్ అండ్ గ్రీన్ పై ప్రత్యేక దృష్టి..

జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన మేడారం మహా జాతరలో సమ్మక్క, సారలమ్మలను కోటి యాభైవేలకు పైగానే భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. అయితే జాతర ముగిసిన తర్వాత మేడారం చుట్టు పక్కల ప్రాంతాల్లో క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టడం ఒక టాస్క్. దీనిని సవాలుగా తీసుకొన్న కలెక్టర్ టీఎస్.దివాకర మేడారంలో పారిశుద్ధ్య పనులను వేగంగా అమలు చేస్తున్నారు. జాతర అభివృద్ధి పనులు ప్రారంభం మొదలు.. జాతర నిర్వహణ వరకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు, సక్సెస్ కు సహకరించిన మీడియాకు కలెక్టర్ దివాకర ధన్యవాదాలు ప్రకటించారు. ఆదివాసీల దేవతల విశ్వాసాన్ని, భక్తిని ప్రజల్లో మరింత పెంచేందుకు కావాల్సిన నిధులు విడుదల చేసినందుకు ప్రభుత్వంతోపాటు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.





# కానిస్టేబుల్ సౌమ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

## ◆ హనుమకొండ కలెక్టర్‌కు పద్మశాలి పరపతి సంఘం వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విధి నిర్వహణలో భాగంగా గంజాయి ముఠాల కర్కశత్వానికి బలియైన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని పద్మశాలి పరపతి సంఘం డిమాండ్ చేసింది. సోమవారం హన్మకొండ జిల్లా కలెక్టరేట్‌లో సంఘం కన్వీనర్ విద్యం రాజగోపాల్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ.. అక్రమ రవాణాను అడ్డుకున్న పద్మశాలి బిడ్డ సౌమ్యపై గంజాయి ముఠా సభ్యులు అత్యంత దారుణంగా దాడి చేసి ప్రాణాలు తీయడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితురాలి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతూ పలు డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మృతురాలి కుటుంబానికి రూ.1 కోటి ఆర్థిక సహాయం అందజేయాలి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి, సౌమ్య రిటైర్మెంట్ వరకు వచ్చే పూర్తి వేతనాన్ని ఆ కుటుంబానికి అందజేయాలి, ఆమె సాహసాన్ని గుర్తించి 'వీర వనిత' బిరుదుతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రపతి అవార్డు వచ్చేలా సిఫార్సు చేయాలి. ఆర్థిక సహాయాన్ని 30 రోజుల్లోగా చెల్లించి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోమిడి నుంచి గుర్రం కోటేశ్వర్, కాజీపేట నుంచి దేవులపల్లి సదానందం, చక్రపాణి, ఎక్సైజ్ కాలనీ నుంచి తలకొక్కుల శ్రీనివాస్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బిట్ల వెంకటేశ్వర్లు, ఇంజనీర్స్ సంఘం నుంచి కొక్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ సౌమ్య మృతి బాధాకరం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** నిజామాబాద్ జిల్లాలో విధి నిర్వహణలో భాగంగా గంజాయి ముఠా దాడిలో ఎక్సైజ్ కానిస్టేబుల్, పద్మశాలి ముద్దుబిడ్డ సౌమ్య మరణించడం అత్యంత బాధాకరమని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన రఘునాథపల్లిలో విలేకరులతో మాట్లాడారు.మత్తు పదార్థాల అక్రమ రవాణాను అడ్డుకుంటున్న ఒక మహిళా అధికారిపై గంజాయి స్మగ్లర్లు కర్కశంగా దాడి చేసి ప్రాణాలు తీయడం సమాజానికే ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధైర్యసాహసాలతో విధులు నిర్వర్తించి ప్రాణత్యాగం చేసిన సౌమ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఈ సందర్భంగా కృష్ణమూర్తి గుర్తుచేశారు.

# కాంగ్రెస్‌లో చేరిన వారికి బీజేపీతో సంబంధం లేదు

## పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న వారు బీజేపీకి చెందిన వారని ప్రచారం చేయడం కేవలం రాజకీయ డ్రామా అని బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ కొట్టిపారేశారు. ఆదివారం పరకాల ఎమ్మెల్యే రేగూరి ప్రకాష్ రెడ్డి సమక్షంలో 22వ వార్డుకు చెందిన బీజేపీ నేతలు కాంగ్రెస్‌లో చేరారని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో చేరిన వ్యక్తులలో ఎవరికీ బీజేపీలో కనీస సభ్యత్వం కూడా లేదని వెల్లడించారు. పార్టీతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులకు బీజేపీ నేతలుగా ముద్ర వేసి, పార్టీలో చేర్చుకున్నట్లు కలరింగ్ ఇవ్వడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి అసత్య ప్రచారాలకు తెరలేపడం ఎమ్మెల్యే స్థాయికి తగదని ఆయన హితవు పలికారు. పరకాలలో భారతీయ జనతా పార్టీకి బలమైన క్యాడర్ ఉందని, ప్రజల అండదండలతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని నిరంజన్ ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇటువంటి జిమ్మిక్కులు చేస్తున్నారని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి అసత్య ప్రచారాలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# ఆశీర్వదించండి.. సేవకుడిగా పనిచేస్తా

## 14వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి భూస శిరీష-రాజు



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** స్థానిక మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. 14వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి భూస శిరీష-రాజు తన వార్డు పరిధిలో విస్తృత పర్యటనలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. సోమవారం వార్డులోని పలు వీధుల్లో పర్యటించిన వారు, కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా భూస శిరీష-రాజు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల ముందుకు వచ్చి, ఆ తర్వాత కనిపించకుండా పోయే 'సీజనల్' నాయకులను నమ్మవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. "నాకు డబ్బుపై ఆసక్తి లేదు, ప్రజలకు సేవ చేయాలనే బలమైన సంకల్పంతోనే మీ ముందుకు వచ్చాను. ప్రజా సమస్యలను పరిష్కరించే వారికే మీ మద్దతు ఉండాలి" అని పిలుపునిచ్చారు. 14వ వార్డు ప్రజలు తనను ఆశీర్వదించి కౌన్సిలర్‌గా గెలిపిస్తే, పదవిని అహంకారంగా కాకుండా ఒక బాధ్యతగా భావిస్తానని పేర్కొన్నారు. నిరంతరం వార్డు ప్రజల మధ్యే ఉంటూ, మౌలిక వసతుల కల్పనలో 14వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని, ఒక నాయకుడిగా కాకుండా మీ ఇంటి బిడ్డగా, సేవకుడిగా పనిచేస్తానని ఉద్ఘాటించారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాళేశ్వరం-చెన్నూరు మధ్య బస్సులు నడపాలి



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** మండలంలోని పలు గ్రామాల ప్రజల రవాణా కష్టాలను తీర్చడానికి కాళేశ్వరం నుంచి చెన్నూరుకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించాలని ఆయా గ్రామాల సర్పంచులు కోరారు. సోమవారం వారు మంచిర్యాల జిల్లా ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ (ఏఎం) శ్రీలతను కలిసి వినతిపత్రం సమర్పించారు. కాళేశ్వరం నుంచి పలుగుల, మద్దులపల్లి, చంద్రుపల్లి, అన్నారం మీదుగా చెన్నూరుకు ప్రతిరోజూ మూడు ట్రిప్పుల చొప్పున బస్సు సర్వీసులు నడపాలని సర్పంచులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో గ్రామస్థులు, ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర వైద్యం కోసం వెళ్లే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఎం దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచుల విజ్ఞప్తిపై అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యను డిపో మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లి, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా త్వరలోనే బస్సు సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలుగుల సర్పంచి విజయలక్ష్మి, మద్దులపల్లి సర్పంచి సరిత, చంద్రుపల్లి సర్పంచి గురుసింగ బాపు, అన్నారం సర్పంచి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ ప్రచారానికి శ్రీకారం

## • 9 వార్డులో చల్లా ధర్మారెడ్డి ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపాలిటీ ఎన్నికల సమరం ముమ్మరమైంది. బీఆర్ఎస్ పార్టీ జెండాను మరోసారి పరకాలపై ఎగురవేయడమే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారానికి అధికారికంగా శ్రీకారం చుట్టారు. పట్టణంలోని 9వ వార్డు నుంచి ఆయన తన ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రచారానికి ముందు చల్లా ధర్మారెడ్డి పరకాలలోని ప్రసిద్ధ శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘనవిజయం సాధించాలని కోరుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రచార రథానికి శాస్త్రోక్తంగా వాహన పూజ నిర్వహించి ప్రచారంలోకి దూకారు. 9వ వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లిన చల్లా ధర్మారెడ్డి, ప్రజలతో మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "బీఆర్ఎస్ హయాంలో పరకాల పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. కానీ నేడు కాంగ్రెస్ పాలనలో ప్రజలు కనీస సౌకర్యాల కోసం ఇబ్బందులు పడుతున్నారు" అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వార్డు సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ ముందుంటానని భరోసా ఇచ్చారు. తన రాజకీయ ఎదుగుదలకు, జీవితానికి పరకాల ప్రజలే వెన్నెముక అని చల్లా ధర్మారెడ్డి భావోద్వేగంగా పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, వార్డు ఇంచార్జులు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. చల్లా ధర్మారెడ్డికి వార్డు ప్రజలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు.

# 12వ వార్డులో 'గులాబీ' జోరు

## ప్రచారంలో గంట కళావతికి బ్రహ్మరథం



**వరంగల్ వాయిస్, పరకాల :** మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. 12వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి గంట కళావతి తన నియోజకవర్గ పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. సోమవారం వార్డులోని ప్రతి ఇంటినీ సందర్శిస్తూ, కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న ఒక కుటుంబాన్ని కళావతి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "పదవి ముఖ్యం కాదు, వార్డు ప్రజల యోగక్షేమాలే నాకు ముఖ్యం. ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటూ, వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను" అని భరోసా ఇచ్చారు. గంట కళావతి చేపడుతున్న ఈ పాదయాత్రకు వార్డు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మహిళలు, వృద్ధులు ఆమెకు హారతులు పట్టి ఘనస్వాగతం పలుకుతున్నారు. "మీకు మా పూర్తి సహకారం ఉంటుంది.. 12వ వార్డులో గెలుపు మీదే" అంటూ ఓటర్లు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారు. ప్రజల నుంచి వస్తున్న ఈ ఆదరణ చూస్తుంటే 12వ వార్డులో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, ఫిబ్రవరి 02, 2026

## ఉపాధి హామీ పనులు ప్రారంభం




**వరంగల్ వాయిస్, నడికూడ :** హనుమకొండ జిల్లా నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ స్వయంగా గ్రామంలోని గార్ల చెరువు వద్ద పనులను ప్రారంభించి, కూలీలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామీణ పేదల కోసం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం ఒక వరం వంటిదని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవి కాలంలో స్థానికంగానే ఉపాధి లభించడం వల్ల వలసలు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ బొట్ల శ్రీను, కారోబార్ కుడుదుల స్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కోటగుళ్లలో ఎస్ఐ దంపతుల పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల అద్భుత శిల్పకళా సంపదకు నిలయమైన గణపురం కోటగుళ్లలో ఆదివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ ఎస్ఐ అరుకాల అనిల్, సంధ్య దంపతులు చారిత్రక శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎస్ఐ దంపతులకు అర్చకులు జూలపల్లి నాగరాజు సాదర స్వాగతం పలికి, శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు పూర్తి చేశారు. అనంతరం కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ప్రతినిధులు ఎస్ఐ దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## విద్యారంగంపై కేంద్రానిది సవతి తల్లి ప్రేమే



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 కేంద్ర బడ్జెట్ విద్యారంగాన్ని తీవ్ర నిరాశకు గురిచేసిందని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి మండిపడ్డారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యను కేంద్రం మరోసారి నిర్లక్ష్యం చేసిందని ఆమె ఆరోపించారు. ఈ మేరకు సోమవారం హనుమకొండలో ఆమె ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. సుమారు రూ.53.5 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన రూ.1.39 లక్షల కోట్లు (కేవలం 2.6%) అత్యంత స్వల్పమని సావిత్రి విమర్శించారు. ప్రపంచంలోనే అత్యధిక యువత ఉన్న దేశంలో విద్యకు ఈ స్థాయిలో నిధులు కోత విధించడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. సొంతంగా తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ–2020) ప్రకారం జీడీపీలో 6% నిధులు కేటాయిస్తామన్న హామీని ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌లలో కోతలు విధించడం సామాజిక న్యాయంపై నేరుగా దాడి చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల పేరుతో విద్యను సామాన్యులకు దూరం చేసి, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన సైనిక్ స్కూల్స్, నవోదయ పాఠశాలలు, ఐఐఎం, ఐఐటీ, సెంట్రల్ యూనివర్సిటీల ఏర్పాటుపై బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన లేకపోవడం రాష్ట్ర విద్యార్థి లోకాన్ని మోసం చేయడమేనని ఆమె పేర్కొన్నారు. విద్యను సరుకుగా మార్చే ప్రయత్నాలను కేంద్రం మానుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థి లోకం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతుందని ఈ సందర్భంగా మాస్ సావిత్రి హెచ్చరించారు.

# తునికాకు యూనిట్లకు వెంటనే టెండర్లు నిర్వహించాలి

◆ సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ డిమాండ్



**వరంగల్ వాయిస్, ములుగు :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని తునికాకు యూనిట్లకు తక్షణమే టెండర్లు నిర్వహించి, గిరిజన కూలీలను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీకి వినతిపత్రం సమర్పించారు. అనంతరం చంద్రన్న మీడియాతో మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీలకు ఎండాకాలంలో 'పెట్టుబడి లేని పంట'గా తునికాకు సేకరణ ఎంతో కీలకమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 249 యూనిట్లలో కొన్నింటిని కోర్ ఏరియా మరియు చేలకపట్టి పేరుతో వేలం వేయకుండా రద్దు చేసేందుకు ప్రయత్నించడం అన్యాయమని ఆరోపించారు. ప్రభుత్వం పకడ్బందీగా వేలం పాటలు నిర్వహించి కూలీలకు ఉపాధి కల్పించాలని కోరారు. 50 ఆకుల కట్టకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.6ధరను కాంట్రాక్టర్ల ద్వారా కచ్చితంగా అమలు చేయాలి. గత ఏడాదికి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న బోనస్ బకాయిలను యుద్ధ ప్రాతిపదికన చెల్లించాలి. ఆకు సేకరణ ఇతర పనులు చేసే కూలీలకు గతంలో కంటే 25 శాతం కూలి పెంచాలి. కూలీల శ్రమను దోచుకుంటున్న ఫారెస్ట్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, విధుల్లోంచి తొలగించాలి. ఆకు సేకరణ సమయంలో గాయపడ్డ వారికి రూ.50 వేలు, వన్యప్రాణుల దాడిలో మరణించిన వారికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి. పార్టీ నాయకుల విన్నపంపై స్పందించిన అదనపు కలెక్టర్ మహేందర్.. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి, నాయకులు ముంజంపల్లి వీరన్న, చిర్ర సూరి, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, జిల్లా సహాయ కార్యదర్శి అలవాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



వరంగల్ వాయిస్, చిట్యాల : తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో ఒక గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన చిట్యాల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు, గౌడ సంఘం నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గాజర్ల సమ్మయ్య గౌడ్ (51), తండ్రి ఐలయ్య గౌడ్, గత శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో తన దైనందిన వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కుతుండగా కాలు జారి కిందపడ్డారు. గమనించిన ఆయన తమ్ముడు మల్లేష్ గౌడ్, తోటి గీత కార్మికులు వెంటనే సమ్మయ్యను చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయం కావడంతో వైద్యులు కుట్లు వేసి, మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించాలని సూచించారు. అనంతరం బాధితుడిని పరకాలలోని లలిత నర్సింగ్ హోమ్‌లో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు సమ్మయ్య గౌడ్ పక్కటెముకలు విరిగాయని, ఇకపై ఆయన చెట్లు ఎక్కడం కష్టమని స్పష్టం చేశారు. గౌడ సంఘం ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ గౌడ సంఘం మండల అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు బుర్ర లక్ష్మణ్ గౌడ్, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల రాజు గౌడ్ వెంటనే స్పందించారు. ఈ విషయాన్ని జయశంకర్ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ద్వారా ప్రభుత్వం నుంచి బాధితుడికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఉపాధి కోల్పోయిన సమ్మయ్య గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా కార్యదర్శి మామిండ్ల శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు తదుక సుధాకర్ గౌడ్ డిమాండ్ చేశారు. సంఘం నాయకులు బుర్ర రమేష్ గౌడ్, బుర్ర శ్రీధర్ గౌడ్, గుర్రపు రాజు గౌడ్, బుర్ర నరేష్ గౌడ్, ఆముదలపల్లి శ్రీనివాస్ గౌడ్, బుర్ర రాజకుమార్ గౌడ్, శ్రీపతి సమ్మయ్య గౌడ్, కట్టాగాని నవీన్ గౌడ్, బుర్ర రఘు గౌడ్, ఉయ్యాల రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి కూలీలకు కుచ్చుటోపి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ఆర్థిక మంత్రి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ గ్రామీణ పేదలను, వ్యవసాయ కూలీలను నిట్టనిలువునా ముంచేలా ఉందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు విమర్శించారు. ఈ బడ్జెట్ ద్వారా కేంద్రం గ్రామీణ కూలీల పొట్టగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో తీసుకొచ్చిన 'వి బి – జి రామ్ జి' చట్టం ద్వారా ఏటా 125 రోజుల పని కల్పిస్తామని ప్రభుత్వం చెప్పడం కేవలం కాగితాలకే పరిమితమైందని ఆయన ధ్వజమెత్తారు. "ఈ చట్టం అమలుకు కనీసం రూ.3 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ. 95 వేల కోట్లు మాత్రమే ప్రతిపాదించడం దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది కూలీలను వంచించడమే" అని ఆయన ప్రశ్నించారు. గతంలో రాష్ట్రాలు 10 శాతం నిధులు భరిస్తే సరిపోయేదని, కానీ కొత్త విధానం ప్రకారం 40 శాతం నిధులు రాష్ట్రాలే భరించాల్సి ఉంటుందని వెంకట్రాములు వివరించారు. నిధుల కొరతతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఈ భారాన్ని భరించలేవని, తద్వారా కేంద్రం నుంచి నిధులు రాక క్రమంగా ఉపాధి హామీ పథకాన్నే రద్దు చేసే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.నరేగా చట్టం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వలసలు తగ్గి, కూలీల కొనుగోలు శక్తి మరియు ఆత్మగౌరవం పెరిగిందని ఆయన గుర్తు చేశారు. పాత బకాయిల కోసమే రూ. 30 వేల కోట్లు అవసరమైన తరుణంలో, అరకొర నిధులతో పథకాన్ని ఎలా నడుపుతారని కేంద్రాన్ని నిలదీశారు. పేదల పొట్ట కొట్టే కొత్త చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, నరేగాను పునరుద్ధరించి రూ.3లక్షల కోట్లు కేటాయించాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉన్న శ్రమజీవులను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

# మీడియాపై బీఆర్ఎస్ దాడి.. ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు

■ చిలువేరు రవీందర్



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేకరులు, కెమెరామెన్లపై బీఆర్ఎస్ నాయకులు వీధి రౌడీల్లా దాడి చేయడం అత్యంత దుర్మార్గమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్ తీవ్రంగా ఖండించారు. సోమవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మీడియాపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయడమేనని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిజా నిజాలు తెలంగాణ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో సిట్ అధికారులు కేసీఆర్‌ను విచారించడంలో తప్పేముందని రవీందర్ ప్రశ్నించారు. "కేసీఆర్ ఎలాంటి తప్పు చేయనప్పుడు బీఆర్ఎస్ నాయకులు ఎందుకు అంతగా భయపడుతున్నారు?" అని ఆయన నిలదీశారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో విలేకరులకు కనీస నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేసిన రోజులను ఆయన గుర్తు చేశారు. కేసీఆర్‌ను విచారిస్తే తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతింటుందని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని ఇంకెన్నాళ్లు పబ్బం గడుపుకుంటారని రవీందర్ ధ్వజమెత్తారు. ఫోన్ ట్యాపింగ్ వంటి తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు విచారణకు సహకరించాల్సింది పోయి, సమస్యను పక్కదారి పట్టించడానికి మీడియాపై దాడులు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతిపై జరిగిన దాడిని తెలుగుదేశం పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తౌటం సంపత్ కుమార్, కాంద్రాతి రాజు, పోలేపాక సాయికుమార్, గై సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి పార్టీలను తరిమికొట్టండి

- పరకాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం
- మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలి
- జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి పిలుపు




**వరంగల్ వాయిస్, పరకాల :** మున్సిపల్ ఎన్నికల్లో అవినీతి పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను తరిమికొట్టి, పరకాల సమగ్ర అభివృద్ధి కోసం బీజేపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం పరకాల బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎమ్మెల్యే వ్యాపార ధోరణితో వ్యవహరిస్తూ భూ దందాలకు పాల్పడి పరకాలను అధోగతి పాలు చేశారని సంతోష్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్యేకు పరకాల అభివృద్ధిపై కనీస శ్రద్ధ లేదని విమర్శించారు. పరకాల రూపురేఖలు మారాలంటే బీజేపీ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త వంద మంది సైనికుల్లా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కేంద్ర మంత్రులు ఈటల రాజేందర్, బండి సంజయ్‌ల సహకారంతో పరకాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ.. గతంలో అధికార బలంతో బీజేపీ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా బీఆర్ఎస్ అడ్డుకుందని గుర్తు చేశారు. కానీ నేడు 22 వార్డుల్లోనూ సమర్థులైన అభ్యర్థులను నిలబెట్టడమే బీజేపీ తొలి విజయమని అన్నారు. పార్టీలో విభేదాలు లేవని, కష్టపడ్డ వారికే టికెట్లు ఇచ్చామని స్పష్టం చేశారు. ఓటర్లను డబ్బుతో కొనాలనుకుంటున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. పరకాలను జిల్లా చేయాలనే సంకల్పం కేవలం బీజేపీకే ఉందన్నారు. చుట్టుపక్కల నియోజకవర్గాల్లో మెడికల్ కాలేజీలు వస్తున్నా, పరకాల మాత్రం మౌలిక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరకాల సమస్యల పరిష్కారానికి బీజేపీ చైర్మన్‌ను గెలిపించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు జయంత్ లాల్, మేగనాథ్, సంద్ర మధు, ఎర్ర రామన్న, కూతురు రాజు, సంగా పురుషోత్తం, మార్త రాజభద్రయ్య, బెజ్జగి పూర్ణాచారి, సిరంగి సతీష్, కుక్కల విజయ్, పాలకుర్తి తిరుపతి, దంచనాల కిరణ్, సాదా రాణి, వెలిశెట్టి శారద తదితరులు పాల్గొన్నారు.

## గణపురం కోటగుళ్లలో శివరాత్రి సంబరాలు

**కళ్యాణ పత్రికల పంపిణీ ప్రారంభం**



**వరంగల్ వాయిస్, గణపురం :** ప్రసిద్ధిగాంచిన కాకతీయుల కళాక్షేత్రం, చారిత్రక సంపద శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం ( కోటగుళ్లు ) లో మహాశివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈనెల 15 నుంచి 17 (మంగళవారం) వరకు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్న శివరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు బూరుగుపల్లి మఠం గంగాధర్, జూలపల్లి నాగరాజులు ఆలయ పోషకులను కలిసి కళ్యాణ పత్రికలను అందజేశారు. హనుమకొండలోని లలిత నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ రాజేశ్వరప్రసాద్ – లలిత దేవి దంపతులకు, అలాగే డాక్టర్ కోడూరు నవీన్ కుమార్ – సుమతి దంపతులకు కళ్యాణ పత్రికను అందించి, శివరాత్రి వేడుకలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి వేద ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ నెల 15న ఉత్సవాలు ప్రారంభమై, 17న ముగియనున్నాయి. ఈ మూడు రోజులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు మరియు కళ్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించనున్నట్లు పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

## దాతల సహకారంతో అంగన్వాడీకి మహర్దశ

**సర్పంచ్ సనత్ కుమార్ పటేల్**



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని అలియాబాద్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం అందుబాటులోకి వచ్చింది. గ్రామంలోని పాత ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో, దానిని అంగన్వాడీ కేంద్రంగా మార్చేందుకు గ్రామ సర్పంచ్ శాతరాశి సనత్ కుమార్ పటేల్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సర్పంచ్ విన్నపానికి స్పందించిన గ్రామానికి చెందిన ప్రముఖ దాత, రైల్వే కాంట్రాక్టర్ జంగిలి రత్నాకర్ సుమారు రూ.1.80 లక్షల ఆర్థిక సహకారాన్ని అందించారు. ఈ నిధులతో పాత స్కూల్ భవనానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, రంగులు వేయించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది సోమవారం అంగన్వాడీ కార్యకలాపాల కోసం అప్పగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సనత్ కుమార్ పటేల్ మాట్లాడుతూ.. అంగన్వాడీ చిన్నారులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వసతులు కల్పించేందుకు సహకరించిన జంగిలి రత్నాకర్‌ను అభినందించారు. జంగిలి కమల్, జె.దేవేందర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి, అంగన్వాడీ సూపర్‌వైజర్ రాణి పాల్గొన్నారు.

# శాస్త్రీయ దృక్పథంతోనే విద్యార్థుల ఉన్నతి

- సైన్స్ ప్రతిభా పురస్కారాల ప్రదానం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు సైన్స్ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పదవ తరగతి విద్యార్థులకు 'సైన్స్ టాలెంట్ టెస్ట్' నిర్వహించారు. మొత్తం 72 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి పది మంది విద్యార్థులకు మండల విద్యాధికారి జి.భిక్షపతి, పాఠశాల ప్రిన్సిపాల్ రజిని, ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ చేతుల మీదుగా శంకర్ నారాయణ డిక్షనరీలను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రజిని మాట్లాడుతూ.. ఇటువంటి పోటీ పరీక్షలు విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు లక్ష్యంతో చదివి సమాజం గర్వించదగ్గ స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించడం, స్కూల్ టాపర్‌కు ప్రత్యేక బహుమతి ఇవ్వడం వంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న మధురమ్మ ట్రస్ట్ నిర్వాహకులను ఆమె అభినందించారు. అనంతరం ఎంఈఓ భిక్షపతి మాట్లాడుతూ.. క్రమశిక్షణతో చదివిన విద్యార్థులే భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో స్థిరపడతారని తెలిపారు. టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచిన ఎన్.మిన్ను, యు.స్నిగ్ధ, పి.శ్రీహర్షిత, కే.శివాత్మిక, ఏ.జాన్వి, కే.ప్రహర్షిని, ఎం.శ్రీనిధి, జీ.దీక్ష, ఎస్.ఇందు, పి.చరణ్యలను ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగూర్ల

**వరికేల కిషన్ రావు హర్షం**



**వరంగల్ వాయిస్, పరకాల :** ఫర్టిలైజర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగూర్ల వెంకటేశ్వర్లు ఎన్నిక కావడం పట్ల తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికేల కిషన్ రావు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కిషన్ రావు మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు మరియు పురుగుల మందులు అందించడంలో ఫర్టిలైజర్ డీలర్ల వ్యవస్థ అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. అటువంటి కీలకమైన రంగానికి రాష్ట్ర అధ్యక్షుడిగా నాగూర్ల వెంకటేశ్వర్లు ఎన్నిక కావడం రైతులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నాగూర్లకు ఫర్టిలైజర్ రంగంలో ఉన్న సుదీర్ఘ అనుభవం, ఆయన సేవాభావం మరియు నాయకత్వ లక్షణాలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డీలర్ల సమస్యలతో పాటు రైతుల ఇబ్బందుల పరిష్కారానికి తోడ్పడతాయని వివరించారు. నాగూర్ల వెంకటేశ్వర్లు ఈ పదవికి పూర్తి న్యాయం చేస్తారని, ఆయన నాయకత్వంలో రైతు రక్షణ సమితి మరిన్ని సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతుందని కిషన్ రావు తెలిపారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, రైతు రక్షణ సమితి తరపున అభినందనలు తెలియజేశారు.

## భవాని ప్రసాద్ పదవీ విరమణ

**ఉద్యోగుల ఘన సన్మానం**



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కేయూ సెంట్రల్ లైబ్రరీలో సుదీర్ఘ కాలంగా సేవలు అందించిన వావిలాల భవాని ప్రసాద్ సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా లైబ్రరీ హాల్‌లో తోటి ఉద్యోగులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికి, శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. విశ్వవిద్యాలయంలో సుమారు 30 సంవత్సరాల పాటు భవాని ప్రసాద్ వివిధ విభాగాల్లో తన సేవలను అందించారు. ముఖ్యంగా సెంట్రల్ లైబ్రరీలో విద్యార్థులకు, పరిశోధకులకు అవసరమైన పుస్తకాల సేకరణ, నిర్వహణలో ఆయన పోషించిన పాత్రను తోటి ఉద్యోగులు కొనియాడారు. క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించి అందరి మన్ననలు పొందారని సహోద్యోగులు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా లైబ్రరీ అసిస్టెంట్లు తేజావత్ జోహార్, ఎస్.సుజాత, ఇతర తోటి సిబ్బంది మాట్లాడుతూ.. భవాని ప్రసాద్ పదవీ విరమణ అనంతరం కూడా సంపూర్ణ ఆరోగ్యంతో, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. లైబ్రరీ సిబ్బంది, తోటి ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొని భవాని ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## కనకం యాదగిరి సంతాప సభ



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** అంబేద్కర్ భావజాలంతో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పరితపించిన వ్యక్తి కనకం యాదగిరి అని పలువురు వక్తలు కొనియాడారు. ఐదు రోజుల క్రితం మరణించిన యాదగిరి సంతాప సభ సోమవారం హసన్‌పర్తిలోని వారి స్వగృహంలో నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరెపల్లి పవన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో యాదగిరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సంతాప సభలో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు రౌత్ రమేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పెద్దమ్మ నరసింహారాములు, వీసం సురేందర్ రెడ్డి, గొర్రె కిరణ్ కుమార్, బిగుళ్ల సురేష్, బీఆర్ఎస్ నాయకులు కందుకూరు చంద్రమోహన్, ఎమ్మార్పీఎస్ నాయకులు మేకల రమేష్, పోతరాజు వీరస్వామి, మాల మహానాడు జిల్లా నాయకులు గరిగే అనిల్, అంబేద్కర్ సంఘం నాయకులు తాళ్ల రవిపాల్, యాదగిరి కుటుంబ సభ్యులు కనకం రంజిత్, కార్తీక్, కుమార్తెలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# అనంతలక్ష్మి ఆయుర్వేద కళాశాలకు కుర్చీలు అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** లేబర్ కాలనీలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అనసూయ పేర్కొన్నారు. సోమవారం కళాశాల పూర్వ విద్యార్థి, అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ బాల్నె సాంబమూర్తి తన సొంత ఖర్చులతో రూ.15,000 విలువైన 50 కుర్చీలను కళాశాల, ఆసుపత్రి అవసరాల నిమిత్తం విరాళంగా అందజేశారు. మొత్తం 50 కుర్చీలలో 30 కుర్చీలను కళాశాల గ్రంథాలయానికి, మిగిలిన 20 కుర్చీలను బోధనా ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం కేటాయించారు. ఈ కుర్చీలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అనసూయ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికిషన్‌లకు డాక్టర్ సాంబమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. తాను చదువుకున్న సంస్థపై మమకారంతో డాక్టర్ సాంబమూర్తి చేసిన ఈ సాయం మిగతా పూర్వ విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని కొనియాడారు. అనంతరం డాక్టర్ సాంబమూర్తి మాట్లాడుతూ.. తన ఎదుగుదలకు కారణమైన కళాశాలకు సేవ చేయడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రొఫెసర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ ఎ.శ్రీధర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ మండల పరశురాములు, యునెస్కో రాష్ట్ర కోఆర్డినేటర్ ధర్మపురి రాజగోవిందు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల కుటుంబాలకు అండగా ‘శ్రీ రాజరాజేశ్వరి యూనియన్’



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆటో డ్రైవర్ల సంక్షేమమే ధ్యేయంగా శ్రీ రాజరాజేశ్వరి ఆటో యూనియన్ ఆదర్శంగా నిలుస్తోంది. యూనియన్ సభ్యులైన డ్రైవర్ల భద్రత కోసం ముందుచూపుతో చేయించిన ఇన్సూరెన్స్ (బీమా), ఆపదలో ఉన్న కుటుంబాలకు కొండంత అండగా నిలిచింది. శ్రీ రాజరాజేశ్వరి ఆటో యూనియన్ తన పరిధిలోని 225 మంది ఆటో డ్రైవర్లకు యూనియన్ తరపున తలా రూ.1100 చొప్పున పోస్ట్ ఆఫీస్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించింది. దురదృష్టవశాత్తు ఇటీవల యూనియన్ సభ్యులైన గుండు రాజు, తోటకూర రమేష్ అనే ఇద్దరు ఆటో డ్రైవర్లు మరణించారు. యూనియన్ ముందుగానే బీమా చేయించడంతో, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున బీమా సొమ్ము మంజూరైంది. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో చెర్రీ కింటెన్ రైస్, ఆటో యూనియన్ అధ్యక్షులు వేల్పుల సాంబమూర్తి, ఉపాధ్యక్షులు గుండు గోవర్ధన్ చేతుల మీదుగా మృతుల కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ రాసమల్ల సురేష్, ఏ.లక్ష్మణ్, పి.మహేందర్, ఆర్.యాదగిరి, కనుకరాజు, జి.యాదగిరి, ఎండీ.షఫీ, అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని మహిళ మృతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండ బస్టాండ్ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగించే ఒక గుర్తుతెలియని మహిళ (సుమారు 45 నుంచి 50 సంవత్సరాలు) సోమవారం మృతి చెందింది. బస్టాండ్ లోని పార్సెల్ కార్యాలయం సమీపంలో ఆమె మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన మహిళను ఎవరైనా గుర్తుపట్టినట్లయితే లేదా ఆమెకు సంబంధించిన వివరాలు తెలిసినట్లయితే వెంటనే హనుమకొండ పోలీసులను ఫోన్ నంబర్: 8712685002లలో సంప్రదించాలని అధికారులు కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసి, మృతురాలి బంధువులను గుర్తించడంలో సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# తొర్రూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ ఖాయం

◆ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి
◆ కాంగ్రెస్ అభ్యర్థులకు బీ–ఫారాలు అందజేత



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని తొర్రూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసి, ఎన్నికల సమరానికి సిద్ధమైంది. మున్సిపాలిటీలోని మొత్తం 16 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు పార్టీ అధికారిక ‘బీ–ఫారాలను’ పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు దిశానిర్దేశం చేస్తూ.. ప్రతి వార్డులో కాంగ్రెస్ జెండా ఎగరడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను గడపగడపకు తీసుకెళ్లి, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అభ్యర్థులకు సూచించారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ వద్ద స్పష్టమైన ప్రణాళిక ఉందని, ప్రజా మద్దతుతో 16 వార్డుల్లోనూ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ సామాన్య ప్రజల పక్షాన నిలబడుతుందని, ఈ స్థానిక ఎన్నికల్లో కూడా అదే నిబద్ధతను చాటుతామని పేర్కొన్నారు. అభ్యర్థులందరికీ వారు విజయకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, అభ్యర్థులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పి.నిర్మల



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయ పీజీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ఆంగ్ల విభాగ సహాయ ఆచార్యులు పి.నిర్మల నియమితులయ్యారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.నరసింహ చారి పదవీ కాలం పూర్తి కావడంతో, వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల ఈ పదవిలో ఒక ఏడాది పాటు కొనసాగుతారు. 1992లో కాకతీయ విశ్వవిద్యాలయంలో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన పి.నిర్మలకి విద్యా రంగంలో అపారమైన అనుభవం ఉంది. గతంలో ఆమె విశ్వవిద్యాలయ పీజీ కళాశాల (నిర్మల్)లో వసతి గృహ సంయుక్త సంచాలకులుగా , కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఆంగ్ల విభాగ అధిపతిగా, పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగావివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. విద్యాబోధనతో పాటు పరిశోధన రంగంలోనూ ఆమె తన ముద్ర వేశారు. ఇప్పటి వరకు 8 జాతీయ, 2 అంతర్జాతీయ సదస్సులలో పరిశోధనా పత్రాలను సమర్పించారు. అలాగే మూడు యూజీ కోర్సులకు సంబంధించిన పుస్తకాలను రచించి విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టనున్న నిర్మలని విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు కలిసి అభినందనలు తెలియజేశారు. ఆమె నాయకత్వంలో కళాశాల మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# వినతుల పరిష్కారానికి తక్షణ చర్యలు

## హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ** ప్రజావాణిలో అందిన వినతులను నిర్ణీత గడువులో పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి.గణేష్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి రెవెన్యూ, హౌజింగ్, విద్యుత్, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 91 వినతులను స్వీకరించారు.

## వరంగల్ బల్దియాలో..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సోమవారం బల్దియా కార్యాలయంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో 79 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఇంచార్జి ఎస్ఈ శ్రీనివాస్ రావు, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డీఫ్ఓ శంకర్ లింగం, సీహెచ్ఓ రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య, టీఓ రామకృష్ణ పాల్గొన్నారు.

# చిన్న వ్యాపారుల కోసం ‘పిల్లో ఏఐ’

◆ ఏపీ సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సాంకేతికతను సామాన్యుడికి చేరువ చేయడంలో ఎప్పుడూ ముందుండే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దేశంలోనే తొలిసారిగా చిన్న, మధ్యతరహా వ్యాపారాల (ఎంఎస్ఎంఈ కోసం రూపొందించిన వాయిస్–ఆధారిత అకౌంటింగ్ ఏఐ ఏజెంట్ ‘పిల్లో ఏఐ’ను సోమవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం స్వయంగా వాయిస్ కమాండ్ ద్వారా మొదటి ఇన్వాయిస్‌ను రూపొందించి, ఈ టెక్నాలజీ పనితీరును ప్రదర్శించారు. ఈ యాప్ ద్వారా వ్యాపారులు క్లిష్టమైన సాఫ్ట్‌వేర్ అవసరం లేకుండా, తమ సొంత మాతృభాషలో మాట్లాడటం ద్వారా బిల్లులు తయారు చేయడం, లావాదేవీలు నమోదు చేయడం మరియు వ్యాపార నివేదికలను పొందవచ్చు. అకౌంటింగ్‌పై అవగాహన లేని వారు కూడా సులభంగా తమ ఆర్థిక వ్యవహారాలను నిర్వహించుకునేలా దీనిని రూపొందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. “చిన్న వ్యాపారాలు డిజిటల్‌గా ఎదిగేందుకు ఇలాంటి ఏఐ సాధనాలు ఎంతో అవసరం. ఇది పారదర్శకతను పెంచడమే కాకుండా, రాష్ట్రంలో ‘ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ను మరింత బలోపేతం చేస్తుంది” అని అన్నారు. పిల్లో ఏఐ వ్యవస్థాపకుడు సాయి ప్రణీత్ జి, సహ వ్యవస్థాపకుడు రామ్ మోహన్ లోచర్లా మాట్లాడుతూ.. ఖరీదైన సిస్టమ్‌లు కొనే శక్తి లేని లక్షలాది మంది చిన్న వ్యాపారులకు ఈ వాయిస్ అకౌంటింగ్ ఒక విప్లవాత్మక మార్పు అని తెలిపారు. స్క్రీన్‌లు, పేపర్‌వర్క్ అవసరం లేకుండా కేవలం సంభాషణతోనే వ్యాపారాన్ని నిర్వహించుకోవచ్చని వివరించారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎస్ విజయానంద్, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, ముత్తవరపు సురేష్, పిల్లో ఏఐ పెట్టుబడిదారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అది చూసి నచ్చకే దూరం పెట్టాను

## మాజీ ప్రియుడి గురించి మృణాల్ కామెంట్స్



కొన్ని రోజులుగా ప్రేమ, పెళ్లి అంశాల్లో వరుసగా వార్తల్లో ఉంటున్నారు నటి మృణాల్ ఠాకూర్. తాజాగా ఆమె తన మాజీ ప్రేమికుడి గురించి చెప్పి మరోసారి నెట్టింట వైరల్‌గా మారారు. అతడితో బంధం ముగిసిపోయినందుకు తానేమీ బాధ పడలేదని తెలిపారు. ఆమె నటించిన తాజా చిత్రం 'దో దీవానే శహర్ మే' ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మాజీ ప్రేమికుడి గురించి ప్రస్తావించారు. నాకు దూకుడు ఎక్కువని నాతో ఉండలేనని బ్రేకప్ చెప్పాడు. నేను యాక్టింగ్ చేయడం కూడా తనకు నచ్చలేదు. విడిపోవడానికి అది కూడా ఓ కారణం. బ్రేకప్ చెప్పినందుకు నేనేం బాధపడలేదు. తన మనస్తత్వం గురించి జాలి పడ్డాను. అలాంటి వాళ్లతో కొనసాగడం కూడా కష్టమే. అందుకే విడిపోయాం. అలాంటివాళ్లతో ఉంటే భవిష్యత్తులో పిల్లలు కూడా అదే భావనలతో పెరుగుతారు. అది నాకు ఇష్టం లేదని మృణాల్ తెలిపారు. కొన్ని నెలలుగా మృణాల్ డేటింగ్ వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. నటుడు ధనుష్ తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ధనుష్ తనకు మంచి స్నేహితుడంటూ ఆ ప్రచారాన్ని మృణాల్ ఖండించారు. తర్వాత టీమిఇండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ తో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వీటిపై స్పందిస్తూ.. 'ఇలాంటి రూమర్స్ వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉంటాయి. వాళ్లు వార్తలు సృష్టిస్తుంటారు. వాటిని చూసి నేను నవ్వుకుంటాను. ఫ్రీ పీఆర్ స్టంట్స్ ఇవి' అంటూ వాటికి చెక్ పెట్టారు.



# జైలర్- 2లో షారూఖ్ ఖాన్

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ క్రేజీ సీక్వెల్ జైలర్ 2. తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రానికి కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. సీక్వెల్‌లో శివరాజ్‌కుమార్, మోహన్ లాల్ పాత్రలు రిపీట్ కానున్నాయని ఇప్పటికే వార్తలు వచ్చాయి. మరోవైపు తాజాగా బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడని అప్‌డేట్ కూడా వచ్చింది. కాగా దీనిపై అఫీషియల్ న్యూస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. జైలర్ 2 నెక్ట్స్ షెడ్యూల్ ముంబైలో జరుగనుంది. తాజా సమాచారం ప్రకారం వచ్చే వారం షురూ కానున్న ఈ షెడ్యూల్‌లో షారుక్ ఖాన్ జాయిన్ అవ్వబోతున్నాడు. ఈ షెడ్యూల్‌లో షారుక్‌ఖాన్‌పై వచ్చే కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి నెల్సన్ దిలీప్ కుమార్ షారుక్ ఖాన్‌ను ఎలాంటి స్పెషల్ రోల్‌లో చూపించబోతున్నాడు.. తలైవా, షారుక్ ఖాన్ కాంబోలో సీన్లుంటాయా..? అన్నది తెలియాల్సి ఉంది. సిల్వర్ స్క్రీన్‌పై ఇద్దరు స్టార్ యాక్టర్లను చూసేందుకు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్, అభిమానులు. జైలర్ 2ను 2026 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని ఇప్పటికే రజినీకాంత్ క్లారిటీ కూడా ఇచ్చాడని తెలిసిందే. సీక్వెల్‌లో బాలీవుడ్ భామ విద్యాబాలన్‌తోపాటు కోలీవుడ యాక్టర్ సంతానం కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలుస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ స్టార్ యాక్టర్లపై అఫీషియల్ అప్‌డేట్ ఏమైనా ఇస్తారేమో చూడాలి. జైలర్ ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా కీలక పాత్రల్లో నటించారని తెలిసిందే. సీక్వెల్‌లో ఎవరెవరుండబోతున్నారన్నదానిపై మేకర్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

# ఓటీటీలో ట్రెండ్ అవుతున్న శంబాలా

ఆది సాయికుమార్ నటించిన మిస్టిల్ థ్రిల్లర్ మూవీ 'శంబాల'. గతేడాది చివర్లో విడుదలైన ఈ సినిమా జనవరి 22న ఆహా వేదికగా ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. తాజాగా ఈ చిత్రం ఓటీటీలో రికార్డు సృష్టించింది. 10 రోజుల్లో 100 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ దాటి అత్యధికంగా వీక్షించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. ప్రేక్షకులకు చిత్ర బృందం కృతజ్ఞతలు తెలిపింది. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అర్చన అయ్యర్ హీరోయిన్. కథేంటంటే..: 1980వ దశకం నేపథ్యంలో సాగే కథ ఇది. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న ఓ ఊరు శంబాల. అక్కడ ఆకాశం నుంచి ఓ ఉల్క పడుతుంది. అప్పటినుంచి ఊరిలో అనూహ్యమైన సంఘటనలు జరగడం మొదలవుతాయి. ఉన్నట్టుండి ఎవరో ఒకరు విచిత్రంగా ప్రవర్తిస్తూ హత్యలు చేస్తారు, ఆత్మహత్యలకు పాల్పడతారు. దాంతో బండ భూతం ఆవహించిందంటూ ఊరి జనం భయంతో వణికిపోతుంటారు. మూఢ నమ్మకాలు రాజ్యమేలుతాయి. ఆ రహస్యాలను ఛేదించేందుకు ప్రభుత్వం విక్రమ్ (ఆది సాయి కుమార్) అనే యువ శాస్త్రవేత్తని ఆ గ్రామానికి పంపిస్తుంది. సైన్స్‌నే నమ్ముకుని విధులు నిర్వర్తించే విక్రమ్ ఆ ఊళ్లో జరుగుతున్న సంఘటనల వెనక రహస్యాల్ని ఛేదించాడా? ఆ ఊరిలో కనిపించిన దేవి (అర్చన అయ్యర్) ఎవరు? విక్రమ్ నమ్ముకున్న సైన్స్‌కీ, ఊరి చరిత్ర వెనకున్న శాస్త్రా నికి మధ్య సంఘర్షణ ఎలా సాగిందన్నది మిగతా కథ.



# పౌరాణిక పాత్రల్లో ఒదిగిపోవాలి



పాత్రల్లో పరకాయ ప్రవేశం చేయాల్సిందే
రామాయణ మూవీపై అరుణ్ గోవిల్

బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ' సినిమాలోని పాత్రల గురించి నటుడు అరుణ్ గోవిల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇలాంటి చిత్రాల్లో నటీనటుల లుక్స్‌పై ప్రేక్షకులు ఎక్కువగా ఫోకస్ చేస్తారని తెలిపారు. వారిని జీవితమంతా అదే పాత్రలో గుర్తుంచుకుంటారని అన్నారు. రామానంద్ సాగర్ తెరకెక్కించిన 'రామాయణ'లో అరుణ్ రాముడిగా కనిపించారు. అప్పటినుంచి రాముడి పాత్ర అనగానే ఆయనే గుర్తుండిపోయేలా అందులో కనిపించి ఆకట్టుకున్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో రానున్న 'రామాయణ'లో అరుణ్ గోవిల్ దశరథుడి పాత్రలో కనిపించనున్నారు. దీని గురించి మాట్లాడుతూ.. 'ఏదైనా సినిమా వస్తుందంటే దానిని పోల్చడానికి ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. మనం దేవుడి పాత్ర పోషించేటప్పుడు చూడగానే అలానే కనిపించాలని. లుక్స్ చాలా ముఖ్యం. ఆడియన్స్ తెరపై మనల్ని చూడరు.. మన పాత్రలో ఉన్న దేవుడిని చూస్తారు. బహుశా దేవుడు నిజంగా ఇలానే ఉండటాడేమో అనుకోవాలి. అంతలా మనం ప్రభావితం చేయాలని చెప్పారు. ఇక ఈ చిత్రాన్ని 'ఆదిపురుష'తో పోల్చవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి చిత్రం దేనికదే ప్రత్యేకమన్నారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా రానున్న ఈ సినిమాలో సీతగా సాయిపల్లవి కనిపించనున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ చిత్రాన్ని సుమారు రూ.4,000 కోట్లతో రూపొందించనున్నారు. ప్రపంచమంతా ఈ ఇతిహాసాన్ని చూడాలన్న లక్ష్యంతోనే దీన్ని భారీస్థాయిలో రూపొందిస్తున్నట్లు నిర్మాత తెలిపారు. ఇందులో రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ ఈ ఏడాది దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్నాయి.

# విజయమే లక్ష్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్
- నర్సంపేట, వర్ధన్నపేట ఎన్నికల ప్రభారీల కీలక సమావేశం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్ లో నర్సంపేట, వర్ధన్నపేట ఎన్నికల ప్రభారీల కీలక సమావేశం గంట రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. అభివృద్ధి, పారదర్శకత, బాధ్యతాయుతమైన పాలనతో పాటు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే బీజేపీ లక్ష్యం అన్నారు. మున్సిపాలిటీల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, స్థానిక సంస్థలలో కూడా బలమైన, ప్రజాపక్ష పాలన అందించేందుకు బీజేపీ నిరంతరం ముందడుగు వేస్తోందని గంట రవికుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, మాజీ మేయర్ టి.రాజేశ్వరరావు, మున్సిపాలిటీ ఎన్నికల ప్రభారీలు రావు పద్మ, గుజ్జ సత్యనారాయణ, జిల్లా కో-కన్వీనర్ కంభంపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీలలో బీజేపీ విజయం సాధించాలనే సంకల్పంతో ఎన్నికల వ్యూహాలు, బూత్ స్థాయి నిర్వహణ, కార్యకర్తల సమన్వయం, ప్రజలతో నేరుగా అనుసంధానం వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యకర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ, గురుమూర్తి శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ ఎన్నికల కో-కన్వీనర్లు మల్లాడి తిరుపతి రెడ్డి, ముత్తిరెడ్డి కేశవరెడ్డి, సర్పంచ్ తాళ్లపెల్లి కుమారస్వామి, జిల్లా పదాధికారులు, నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీల వార్డుల ప్రభారీలు పాల్గొన్నారు.



# జర్నలిస్ట్ జగదీశ్వర్‌కు నివాళి

సీనియర్ జర్నలిస్ట్ గోగుల జగదీశ్వర్ కు ఘన నివాళి అర్పించారు. గత నాలుగు దశాబ్దాలుగా ఆయన మొగుళ్లపల్లి ఆంధ్రప్రభ విలేకరిగా పనిచేశారు. అనారోగ్య కారణాలతో జగదీశ్వర్ జనవరి 27న తుది శ్వాస విడిచారు. సోమవారం జగదీశ్వర్ కుమారుడు జర్నలిస్ట్ గోగుల నాగరాజును వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, సీనియర్ జర్నలిస్టులు చందుపట్ల అమరేందర్, బొజ్జం చొక్కారావు, ఉష్ణగిరి శ్రీకాంత్ పరామర్శించారు. జగదీశ్వర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

–వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి

# తాగునీటిని పునరుద్ధరించండి

- బల్దియా ఎదుట ధర్నా
- కమిషనర్ కాళ్లు మొక్కేందుకు యత్నించిన దళిత మహిళ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రెండు వారాలుగా తాము నివాసముంటున్న గుడిసెలకు తాగునీటి సరఫరాను నిలిపివేశారని చెరబండరాజునగర్ వాసులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం కాలనీ నుంచి కార్పొరేషన్ వరకు అంబేద్కర్ చిత్ర పటం, ఖాళీ బిందెలు, కుండలు చేతబూని డప్పుచప్పుళ్లతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్పొరేషన్ లోని కౌన్సిల్ హాల్ ఎదుట బైఠాయించి రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. అధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్ చాహత్ భాజ్‌పయ్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. కమిషనర్ కాళ్లు మొక్కేందుకు మహిళ యత్నించగా అడ్డుకున్నారు. అనంతరం కాలనీ వాసులు మాట్లాడుతూ.. దళితులమైనందునే చిన్న చూపు చూస్తున్నారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోగా, తమను బెదిరింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. రెండు వారాలుగా నీటి సరఫరాల నిలిపివేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి కావాలనే గుడిసెవాసుల ఇండ్లు కూల్చి తమని వెళ్లగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంలో ఉన్నవారు కుట్రలతో తమ బతుకును రోడ్డున పడేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు బస్కుల కుమారస్వామి, గన్నారపు రాజు, జన్ను ప్రవీణ్, ఎర్రోళ్ల కర్ణాకర్, పుల్లా రత్నాకర్, రడపాక బాబు, రడపాక రేణుక, జన్ను సునీల్, మాచర్ల యమునా, కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు డాక్టర్ కంజర్ల మనోజ్ కుమార్, కొడకండ్ల సదాంత్, పున్నం చందర్, కోటిలింగం, జయరాం, ప్రదీప్ పాల్గొన్నారు.

# వారసత్వ కట్టడాలపై కేంద్రం దృష్టి సారించాలి

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** వరంగల్ లోని కాకతీయుల కాలంనాటి చారిత్రక కట్టడాల సంరక్షణ, అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య డిమాండ్ చేశారు. జిల్లాలోని చారిత్రక కట్టడాలను నేషనల్ మిషన్ ఆన్ మాన్యుమెంట్స్ అండ్ యాంటిక్విటీస్ లేదా ఇతర కేంద్ర ప్రభుత్వ పథకాల కింద అభివృద్ధి చేస్తున్నారా? గత మూడేళ్లుగా వాటికి కేటాయించిన నిధులు ఎంత? ఆక్రమణలు, నిర్మాణ నష్టం నివారించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి? అనే అంశాలపై లోక్‌సభలో సంస్కృతి శాఖ మంత్రిని కడియం కావ్య వివరణ కోరారు.

దీనికి సమాధానంగా కేంద్ర సంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో మొత్తం ఎనిమిది కేంద్ర పరిరక్షిత స్మారక కట్టడాలు ఉన్నాయని, వాటిలో వరంగల్ లోని వెయ్యి స్తంభాల ఆలయం, వరంగల్ కోట కూడా ఉన్నాయని తెలిపారు. జాతీయ సంరక్షణ విధానానికి అనుగుణంగా ఈ కట్టడాల పరిరక్షణ, సంరక్షణ పనులు నిరంతరం జరుగుతున్నాయని, ప్రస్తుతం ఇవి మంచి స్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు.

తెలంగాణలో స్మారక కట్టడాల సంరక్షణకు 2022–23లో రూ.15.50 కోట్లు, 2023–24లో రూ.14.38 కోట్లు, 2024–25లో రూ.6.80 కోట్లు కేటాయించగా రూ.6.77 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. హృదయ్ పథకం కింద వరంగల్‌ను వారసత్వ నగరంగా అభివృద్ధి చేయగా, 2018లో వెయ్యి స్తంభాల ఆలయం వద్ద టైల్ పార్కింగ్, లైటింగ్ సదుపాయాలు కల్పించారని, 2022లో వరంగల్ కోట ఉత్తర ద్వారం, కుష్ మహల్, స్వయంభూ ఆలయ సముదాయం, కీర్తి తోరణం వద్ద ఫసాడ్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే, వరంగల్ లోని స్మారక కట్టడాల కోసం ఎన్‌ఎంఎంఏ కింద ప్రత్యేక పథకాలు ఏవీ ప్రతిపాదించలేదని మంత్రి స్పష్టం చేశారు. ఆక్రమణల నివారణకు పురావస్తు శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఆర్కియాలజీ ఆధ్వర్యంలో షోకాజ్ నోటీసులు జారీ చేయడం, జిల్లా యంత్రాంగం, పోలీసులతో సమన్వయం చేసుకుని తొలగింపులు చేపట్టడం, వాచ్ అండ్ వార్డ్ సిబ్బంది, ప్రైవేట్ భద్రతా సిబ్బందిని నియమించడం, తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సమాధానంపై స్పందించిన వరంగల్ పార్లమెంట్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య.. ప్రస్తుతం జరుగుతున్న నిర్వహణ పనులను స్వాగతిస్తూనే, వరంగల్ స్మారక కట్టడాల కోసం ప్రత్యేక కేంద్ర పథకాలు లేకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. కాకతీయుల కాలంనాటి అమూల్య వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు, వరంగల్ పర్యాటకాభివృద్ధికి దోహదపడేందుకు కేంద్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టాలని ఎంపీ కోరారు.

# ఓం..బీం..ఫాం..

- కొందరికే 'సార్ల' ఆశీర్వాదం
- వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు
- 'దడ' పుట్టిస్తున్న రెబల్స్
- అసక్తిగా 'పుర' ఎన్నికలు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పురపాలక ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు ఉవ్విళ్లూరుతున్నారు. మున్సిపాలిటీ ఎన్నికలు చాలెంజ్ గా తీసుకుంటున్న ఆయా పార్టీలు ఎక్కువ మందిని బరిలో నిలిపేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో వార్డు కౌన్సిలర్ల పదవి కోసం ఆశావాహులు భారీగానే నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పుడు విత్ డ్రా చేసుకునేందుకు వారు ముందుకు రాకపోవటంతో ప్రధాన రాజకీయ పార్టీలకు పెద్ద సమస్యగా మారింది. వారు పార్టీకి కొరకరానికి కొయ్యగా మారారనే చెప్పవచ్చు. పార్టీ బీ–ఫాంలపై నేటికే అనేక స్థానాల్లో ఉత్కంఠ వీడకపోవడంతో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. వివిధ స్థానాల్లో రెబల్స్ దడ పుట్టిస్తోంది. జరుగుతున్న ఈ తంతును ఓటర్లు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు.

### 15 వార్డులు..146 నామినేషన్లు..

డోర్నకల్ పురపాలికలో 15 వార్డులకు గాను 146 మంది నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ నుంచి 52, బీఆర్ఎస్ నుంచి 24, బీజేపీ నుంచి 13, ఇద్దరు సీపీఎం, ఒకరు బీఎస్పీ, ఒకరు జనసేన తొమ్మిది మంది స్వతంత్రులు నామినేషన్లు వేశారు. ప్రధాన పార్టీలు అన్ని స్థానాల్లో పోటీకి దిగడంతో రాజకీయం రసకందాయంలో పడింది. ఇప్పటికే ఒకే పార్టీకి చెందినవారు ఇద్దరు పోటీకి నిలవడం ప్రధాన పార్టీలకు తలనొప్పిగా మారింది. ముల్లె మూటతో వచ్చిన కొందరికి 'సార్ల' ఆశీర్వదం అందటంతో ప్రచారం బాట పట్టారు. ఈ దరిమిల్లా అధికార ప్రతిపక్ష పార్టీలకు రెబల్స్ దడ పుట్టి పీడిస్తోంది. ఎప్పుడు ఏం చేస్తారో.. అని ప్రధాన పార్టీల నేతల్లో గుబులు నెలకొంది. వీరితో సయోధ్య కోసం నాయకులు ప్రయత్నించినా ససేమీరా అంటున్నారు. పార్టీ టికెట్ ఆశించి రాకుంటే పక్క పార్టీ తీర్థం పుచుకోనైనా పోటీ చేయాలని నిర్ణయించారు. రెబల్స్ ను బుజ్జగించేందుకు చేస్తున్న ప్రయత్నాలు తారస్థాయి చేరాయి.

### బందవిముక్తి కానున్న బీ ఫాంలు..

పోటిలో నిలుచున్న అభ్యర్థులను వడకట్టిన 'సార్లు' మంగళవారం బీ ఫాంలు అందించనున్నారు. పార్టీ బీ ఫాం అందిన వ్యక్తులకే పార్టీ గుర్తులు కెటాయించబడటంతో జరిగే ఈ తంతును ప్రజలు ఆసక్తీగా గమనిస్తున్నారు. కుల, ప్రజా, ఆర్థిక బలమున్న వారికే బీ ఫాం ఇచ్చేందుకు పార్టీలు సిద్ధపడుతున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com